చలి కాలం.. వ్యాధుల భయం

- ఎక్కువగా ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ కేసులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు



గుంటూరు మెడికల్: శీతాకాలం వచ్చేసింది. వేకువ జామున మంచు కురిసే కాలం. రుతువులను గుర్తుచేస్తూ కనువిందు చేస్తోంది. కవి హృదయాలను పులకింపజేస్తోంది. జాగింగ్, వాకింగ్‌లతో గడుపుతుంటారు. అదే సందర్భంలో చల్లని గాలులకు వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. అలాంటి వారు రక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఎలాంటి వ్యాధులకు గురవుతారంటే



చలికాలంలో అస్తమా, సీఓపీడీ (క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డీసీజ్), అలర్జీ, న్యుమోనియా తదితర శ్వాసకోశ వ్యాధుల ముప్పు పొంచి ఉందని పల్మనాలజిస్టులు హెచ్చరిస్తున్నారు. శ్వాసకోశ వ్యాధులతో రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిపై వైరస్ త్వరగా దాడి చేస్తుందని చెబుతున్నారు. గోరంట్ల ప్రభుత్వ ఛాతి, సాంక్రమిక వ్యాధుల ఆస్పత్రికి, గుంటూరు జీజీహెచ్‌కు ఓపీ విభాగానికి వచ్చే రోగుల్లో శ్వాశ కోశ సంబంధిత బాధితులు ఎక్కువగా వస్తున్నట్లు వైద్య నిపుణులు వెల్లడించారు.

ఊపిరితిత్తులపై ప్రభావం..

వాతావరణం చల్లగా ఉండడంతో ప్రజలు 'సివియర్ అలర్జీ బ్రాంకై టిస్' బారినపడుతున్నారు. దగ్గు, ఆయాసం, జలుబు, రొంప, ఆస్తమా, నిమోనియా, సీఓపీడీ, గాలి పీల్చుకోవడం వంటి సమస్యలతో బాధపడే వారి సంఖ్య బాగా పెరిగిందని ప్రభుత్వ ఛాతి, సాంక్రమిక వ్యాధుల ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీకంటి రఘు తెలిపారు. సాధారణ రోజుల్లో వచ్చే ఓపీ కంటే చలికాలంలో వల్ల వచ్చే వ్యాధుల్లో భాగంగా ఓపీ రెట్టింపు అయిందని వెల్లడించారు. ఐదారు రోజుల్లో తగ్గే జబ్బు, అలర్జీలు ప్రస్తుతం వారం నుంచి రెండు వారాలు ఉంటున్నాయని వైద్యులు చెబుతున్నారు.



అస్తమాతో అవస్థలే..



అస్తమా, న్యుమోనియా, సీఓపీడీ, గుండె వ్యాధులతో బాధపడే వారికి చలికాలం కష్టమేనని వైద్యులు తెలిపారు. చల్లటి ప్రదేశంలో తిరిగినా, చల్లటి ఆహారం తీసుకున్నా, ఏసీ గదుల్లో ఉన్నా అస్తమా సమస్య పెరుగుతుంది. చలికాలంలో దగ్గు, జలుబు వంటి సమస్యలు వస్తే అస్తమా, న్యుమోనియా రోగులకు మరింత ఇబ్బంది ఉంటుంది. అస్తమా, న్యుమోనియాతో బాధపడేవారు మందులు వాడకపోతే సమస్య తీవ్రంగా మారే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

చర్మంపై ప్రభావం



చల్లటి వాతావరణంతో శరీరం తెల్లగా పొడిబారినట్లు మారిపోతోంది. పెదవులు పగిలిపోయి, ముఖం కాంతిహీనంగా మారుతోంది. అరికాళ్లు పగుళ్లు ఏర్పడుతున్నాయి. శరీరంలో తేమ శాతం తగ్గడంతో చర్మ రక్షణ శక్తి తగ్గి దురదలు వస్తున్నారు. ముఖంపై పొడిబారిపోవడం వలన పగుళ్లు వస్తాయి. చేతులపై పగుళ్లు మాదిరిగా తెల్లటి గీతలు వస్తాయి. ఈ తరహా సమస్యలు షుగర్ బాధితులకు వస్తే ఇబ్బందులుంటాయి.

వేడి నీటితో ఉపశమనం



శ్వాసకోశ, చెవి, ముక్కు, గొంతు సమస్యలున్న వారు చలికాలంలో జాగ్రత్తగా ఉండాలి. నీరు వేడిచేసి వడపోసుకుని తాగాలి. వెచ్చని దుస్తులు ధరించాలి. శరీరం పూర్తిగా కవర్ అయ్యే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి. చల్లటి పానీయాలు, ఐస్‌క్రీమ్‌లు తీసుకోవద్దు. గొంతునొప్పి ఉన్న వారు ప్రతిరోజూ రెండుసార్లు వేడి చేసిన నీటిలో కొంచెం ఉప్పు వేసి వాటిని పుక్కిలించి ఉమ్మి వేయాలి. ఐదారుసార్లు చేయాలి. ఇలా ఉదయం సాయంత్రం చేస్తే గొంతు నొప్పి తగ్గే అవకాశముంది. ఫ్రిజ్‌లో పెట్టిన నీరు తాగొద్దు. వేడి ఆహారం తీసుకోవాలి.

ఆస్పత్రులలో కేసులు నమోదు ఇలా..

గోరంట్ల ప్రభుత్వ ఛాతి సాంక్రమిత వ్యాధుల ఆస్పత్రికి కొద్దిరోజులుగా ఊపిరితిత్తుల సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారి సంఖ్య ఎక్కువగా వస్తున్నట్లు వైద్యులు తెలిపారు. గతంలో ప్రతిరోజూ 30 నుంచి 50 మంది బాధితులు ఉంటే నేడు 70 నుంచి వంద మంది వరకు బాధితులు వస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలో శ్వాస కోశ సంబంధిత వ్యాధులకు చికిత్స అందించే పల్మనాలజిస్టులు 20 మంది ఉన్నారు. ఒక్కో వైద్యుడి వద్దకు ప్రతిరోజూ పది నుంచి 20 కొత్త కేసులు వస్తున్నాయి.

గుండె జబ్బు బాధితులు జాగ్రత్తగా ఉండాలి



చలికాలంలో గుండె జబ్బులు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలి. గుండెలో బ్లాక్స్, కొలెస్ట్రాల్ ఉన్న వారిలో రక్తనాళాల్లో పగుళ్లు ఏర్పడే అవకాశం ఉండడంతో గుండె వైఫల్యం చెందే ముప్పు ఉంది. కొన్నిసార్లు ఇన్‌ఫెక్షన్‌ల వల్ల కూడా రక్తనాళాలు రప్చర్ అవుతుంటాయి. చలి ఎక్కువగా ఉంటే వాకింగ్ చేయొద్దు. అధిక బరువు, అస్తమా, గుండె జబ్బులున్న వారు వాకింగ్ విషయంలో అప్రమత్తంగా ఉండాలి. చలికాలంలో స్మోకింగ్ చేయడం మానివేయాలి. స్మోకింగ్, విషపదార్థాల వల్ల ముప్పు ఏర్పడుతుంది. ఆల్కహాల్ తీసుకుంటే గుండె సమస్యలు వస్తాయి.

– డాక్టర్ అనురాగ్ పోలవరపు, ఇంటర్వెన్షన్ కార్డియాలజిస్ట్, గుంటూరు

ముందస్తు జాగ్రత్తలు అవసరం



చలికాలంలో ఊపిరితిత్తుల సమస్యలు తలెత్తకుండా ప్రతి ఒక్కరూ కొద్దిపాటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. చలి అధికంగా ఉన్న సమయంలో ముఖ్యంగా రాత్రి వేళల్లో బయట తిరగకూడదు. రాత్రి సమయంలో విధుల నిర్వహణకు వెళ్లేవారు ముఖానికి మాస్క్ ధరించి శరీరమంతా కప్పి ఉండే నూలు వస్త్రాలు ధరించడం మంచిది. ఉదయం పూట వాకింగ్ దూరంగా ఉండటం ఉత్తమం. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. జలుబు, దగ్గు, ఉన్నవారు చల్లటి నీరు, ఐస్ క్రీమ్‌లు ఎట్టి పరిస్థితుల్లో తీసుకోకూడదు. వేడివేడి ఆహార పదార్థాలు భుజించడం మంచిది.

– డాక్టర్ బి.దుర్గాప్రసాద్, పల్మనాలజిస్ట్, గుంటూరు

క్లుప్తంగా

రాష్ట్రాన్ని దోచుకుంటున్న కార్పొరేట్లు



లక్ష్మీపురం: రాష్ట్రాన్ని అంబానీ, అదానీలు దోచుకుంటున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ విమర్శించారు. బ్రాడీపేటలోని తాలుకా కార్యాలయం వద్ద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సోమవారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్పొరేట్లతో పాటు నరేంద్రమోదీ, అమిత్‌షాను దేశం నుంచి తరిమి కొడితే గాని భారతదేశం పూర్తిస్థాయి స్వాతంత్ర్యంగా ఉండదని పేర్కొన్నారు. భవిష్యత్ పోరాటానికి ప్రజలందరూ కూడా కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, నాయకులు ఆకిటి అరుణ్ కుమార్, రావుల అంజిబాబు, జి. సురేష్ బాబు, మంగా శ్రీనివాస రావు పాల్గొన్నారు.

అవినీతిని అరికట్టేందుకు కృషి చేయాలి



లక్ష్మీపురం: పాలనలో అవినీతిని అరికట్టడం ప్రస్తుత పరిస్థితుల్లో ఓ పెద్ద సవాల్ అయినా పాలకులకు చిత్తశుద్ధి ఉంటే అవినీతిని 90 శాతం వరకు అరికట్టవచ్చని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో అవినీతిపై సోమవారం చర్చ కార్యక్రమం నిర్వహించారు. అచ్యుత ఇందుశేఖర్, ఇంజినీర్ ఎన్.సదాశివం మాట్లాడారు.

క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం



గుంటూరు ఎడ్యుకేషన్: క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం సాధ్యమని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహన్‌కృష్ణ పేర్కొన్నారు. సోమవారం బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో ఆక్స్‌ఫర్డ్ స్కూల్ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న మోహన్‌కృష్ణ క్రీడాజ్యోతిని వెలిగించారు. ఆయన మాట్లాడుతూ ఏదైనా సాధించాలనే కసి విద్యార్థుల్లో ఉండాలని, పట్టుదల, నిరంతర సాధనతో అది సాధ్యపడుతుందని పేర్కొన్నారు. చదువుతో పాటు విద్యార్థులు ప్రతి రోజూ ఆటలు ఆడాలని, తద్వారా శారీరక, మానసిక ఉల్లాసం, ఉత్సాహం కలుగుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణించి, మేటి క్రీడాకారులుగా ఎదగాలని సూచించారు. సచిన్ టెండూల్కర్, పీవీ సింధూను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కామన్‌వెల్త్ గేమ్స్ బంగారు పతక గ్రహీత నాగం జ్ఞానదివ్య మాట్లాడుతూ విద్యార్థి స్థాయిని గమనించి, ఏ రంగంలో రాణిస్తారో ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈసందర్భంగా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఎస్.ఫ్రాన్సిస్‌రెడ్డి, డైరెక్టర్లు ఎస్.విజయభాస్కర్‌రెడ్డి, ఎస్.జోసఫ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అమీనాబేగం, వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి, ఫిజికల్ డైరెక్టర్లు వేణుగోపాల్, రసూల్, అమీర్, శశి, మల్లికార్జునరావు, షరీఫ్, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

వార్డు శానిటేషన్ కార్యదర్శుల సమస్యలపై వినతి

నెహ్రూనగర్: వార్డు శానిటేషన్ కార్యదర్శుల సమస్యలను పరిష్కారించాలని ఏపీజీఈఏ రాష్ట్ర కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ విన్నవించారు. ఈ మేరకు వడ్డేశ్వరంలోని రాష్ట్ర మున్సిపల్ శాఖ ప్రధాన కార్యాలయంలో ఆ శాఖ మంత్రి నారాయణను కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శానిటేషన్ కార్యదర్శులకు ఉదయం 10.30గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధులు ఉండేలా చూడాలని, వీరికి మున్సిపల్ శాఖలో, పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో, మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్, ఫుడ్ సేఫ్టీ శాఖ, సంబంధిత శాఖల్లో పదోన్నతులు కల్పించాలని, జనన మరణ ధ్రువీకరణ పత్రాలు, ట్రేడ్ లైసెన్స్, మ్యారేజ్ సర్టిఫికెట్స్ మంజూరు చేసే అధికారం ఇవ్వాలని కోరారు. మంత్రిని కలసిన వారిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పారిశుద్ధ్య, పర్యావరణ వెల్ఫేర్ కార్యదర్శుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావు, నాయకులు భాను ప్రకాష్, రఫీ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

నెహ్రూనగర్: ఎటువంటి అనుమతులు లేకుండా గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 28వ డివిజన్ ఎన్‌జీఓ కాలనీలో ఎన్టీఆర్ విగ్రహాన్ని టీడీపీ నేతలు ఆవిష్కరించారు. కేంద్ర మంత్రి పెమ్మసాని, పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ప్రారంభించడంపై మరింత దూమారం రేగింది. గతంలో ఇదే ప్రాంతంలో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం ఉండేది. ప్రస్తుతం సిమెంట్ రోడ్డు నిర్మాణం చేశారు. ఈ క్రమంలో ప్రస్తుతం ఉన్న వైఎస్సార్ విగ్రహాన్ని వెనక్కి జరిపితే ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవని వైఎస్సార్ సీపీ నాయకులు ఆ విగ్రహాన్ని తొలగించి.. దాని వెనుకే కొత్త విగ్రహం ఏర్పాటుకు దిమ్మె నిర్మాణం చేపట్టారు. అయితే టీడీపీ నేతలు రాత్రికి రాత్రే ఆ దిమ్మెను తొలగించి... అదే స్థానంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆరోపిస్తున్నారు. అధికారం ఉంది కదా అని వైఎస్సార్ విగ్రహం కోసం ఏర్పాటు చేసిన స్థానంలో టీడీపీ శ్రేణులు ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయడంపై పలువురు టీడీపీ నేతల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీనిపై నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులను వివరణ కోరగా, పొంతన లేని సమాధానం చెబుతున్నారు.



ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యేలు గల్లా మాధవి, బూర్ల

కరాటే చాంపియన్‌షిప్‌లో సత్తా చాటిన విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ జాతీయస్థాయి కుంగ్‌ఫూ, కరాటే చాంపియన్‌షిప్–2024లో శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. చిలకలూరిపేటలో ఆదివారం పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. లక్ష్మీపురంలోని పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో విష్ణువర్ధన్ మాట్లాడుతూ అండర్–12 విభాగంలో మూడో తరగతి విద్యార్థిని ఆకేటి జన్విక భగత్, అండర్–8 విభాగంలో యూకేజీ విద్యార్థి ఆకేటి విప్లవ చంద్ర బంగారు పతకాలను కై వసం చేసుకున్నారని వివరించారు. ఈసందర్భంగా విద్యార్థులకు శిక్షణ కల్పించిన కోచ్ ఎం. కిరణ్‌ను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతీదేవి, కో–ఆర్డినేటర్లు దుర్గాశ్యామ్, శ్రీదేవి పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న విష్ణువర్ధన్, కృష్ణవేణి

ఫీజు రీయింబర్స్‌మెంటును వెంటనే విడుదల చేయాలి

లక్ష్మీపురం: రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంటును వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యశ్వంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి, కలెక్టర్ నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యశ్వంత్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ ఇంజినీరింగ్ పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ. 2100 కోట్లు, వసతి దీవెన రూ.1400 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు శివ, జిల్లా సహాయ కార్యదర్శి అమరనాథ్, నగర కార్యదర్శి సాయి, ప్రతిపాడు నియోజకవర్గ అధ్యక్షులు డేవిడ్ నగర ఉపాధ్యక్షులు సాగర్, నగర సహాయ కార్యదర్శి వెంకట్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు గౌతమ్, నితిన్, ఆనంద్, అంకమరావు, శ్రీను, అజయ్, ప్రభాస్, చరణ్, నాని, వెంకట్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చాలి

లక్ష్మీపురం: ఎన్నికల సమయంలో ఊరురా తిరుగుతూ ప్రజాగళం పేరుతో లోకేష్ కార్మికులకు వాగ్దానాలు ఇచ్చినా అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటిన ఇచ్చిన హామీలు అమలు కాకపోవటం బాధాకరమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ భవన నిర్మాణ, ఇతర కార్మికుల సంఘాల (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, యూనియన్ జిల్లా నాయకులు కే శ్రీనివాసరావు, గుంటూరు పశ్చిమ కమిటీ కార్యదర్శి ఎస్.కె.కాశీం వలి, తూర్పు కమిటీ కార్యదర్శి దీవెనరావు, శ్రీనివాసరావు, ఎస్‌కే బాషా, డి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

15న విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు

నగరంపాలెం: స్థానిక సంపత్‌నగర్ శ్రీశారదా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో ఈనెల 15న పాఠశాల స్థాయి విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రతినిధి పోలిశెట్టి శ్రీహరిప్రసాద్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1–5 తరగతి వరకు జూనియర్స్, 6–10 తరగతి వరకు సీనియర్స్‌గా విభజించామని అన్నారు. భగవద్గీత 15వ అధ్యాయం పూర్తిగా(పురుషోత్తమ ప్రాప్తియోగం), సుమతి శతకం ఒకటి నుంచి పది వరకు పద్యాలు, చిత్రలేఖనం(శ్రీరాముని చిత్రం), భక్తి గీతాల(ఒక పాట) పోటీలు ఉంటాయని తెలిపారు. చిత్రలేఖనం పోటీల్లో పాల్గొనే వారికి చార్టు ఉచితంగా అందిస్తామన్నారు. వివరాలకు 8977585444, 08632356444 సంప్రదించాలని చెప్పారు.

ఆటో డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ ఆటో స్టాండ్ ప్రారంభం

లక్ష్మీపురం: ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, ఈ చలానా రద్దు చేయాలని, జీఓ నెంబర్ 21, 31ని రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. గుజ్జనగుండ్లలోని నగర ఆటోడ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ నగర సమితి ఆధ్వర్యంలో జేకేసీ కళాశాల రోడ్డు వద్ద యూనియన్ నూతన ఆటో స్టాండ్‌ను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమానికి సంఘం నగర ప్రధాన కార్యదర్శి మంగ శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. తొలుత సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆటో స్టాండ్ నూతన కమిటీని అధ్యక్షులుగా దాసరి విజయ్ కుమార్, ఉపాధ్యక్షులుగా పోతల సాయి, కార్యదర్శిగా అమ్మిశెట్టి మురహరి రావు, సహాయ కార్యదర్శి షేక్ ఖాలీల్, కోశాధికారిగా రుంజా యేసు రాజు వీరితోపాటు 25 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

మహిళలకు రక్షణ కల్పించడంలో పాలకులు విఫలం

ఐద్వా నగర కార్యదర్శి కళ్యాణి

లక్ష్మీపురం: మహిళలపై, చిన్నారులపై దాడులను అరికట్టడంతో పాలకులు విఫలమయ్యారని ఐద్వా నగర కమిటీ కార్యదర్శి ఎ.కళ్యాణి విమర్శించారు. నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు నిర్వహిస్తున్న హింస వ్యతిరేక కార్యక్రమంలో భాగంగా సోమవారం గుజ్జనగుండ్లలో ఐద్వా ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రధానంగా మద్యం, గంజాయి అమ్మకాలు అలాగే సోషల్ మీడియాలో అశ్లీల వెబ్‌సైట్లను నియంత్రించడంలో ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని అన్నారు. మహిళా హక్కులు మానవ హక్కులే కాబట్టి రాజ్యాంగం ఇచ్చిన హక్కుని కాపాడే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మంగళవారం శంకర్ విలాస్ సెంటర్‌లో మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలని సంతకాల సేకరణ చేపట్టనున్నట్లు వెల్లడించారు. అనంతరం ఐద్వా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆ కమిటీ కార్యదర్శిగా షేక్ షకీల, అధ్యక్షరాలుగా కే భవాని ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నిర్మల, జుబేదా, ఆషా,అంజలి, అన్నా మేరీ, సమీరా, నగ్మా బాయి, బాజీ, నాగూర్ బి పాల్గొన్నారు.



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ఐద్వా నాయకులు

20, 23న రాష్ట్ర, జిల్లా స్థాయి క్విజ్‌బీ, స్పెల్‌బీ పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాలరోడ్డులోని డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్లో ఈనెల 20న రాష్ట్ర స్థాయి క్విజ్‌బీ, 23న జిల్లాస్థాయిలో స్పెల్‌బీ పోటీలు నిర్వహించనున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. సోమవారం పాఠశాలలో పోటీలకు సంబంధించిన బ్రోచర్లు విడుదల చేశారు. ఈసందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ 8,9,10 తరగతుల విద్యార్థులకు ఆయా పోటీలను నిర్వహించి, నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తామని తెలిపారు. ప్రతి పాఠశాల నుంచి ఒక్కో టీం చొప్పున విద్యార్థులు హాజరు కావాలని, క్విజ్ విజేతలకు రూ.ఐదు వేలు, ట్రోఫీ, స్పెల్‌బీ విజేతలకు రూ.వెయ్యి, ట్రోఫీ ప్రదానం చేస్తామన్నారు. ఈనెల 20న ఉదయం 9.00 గంటలకు రాష్ట్ర స్థాయిలో సూపర్ క్విజ్‌బీ పోటీల్లో భాగంగా ప్రిలిమినరీ రౌండ్ ఉంటుందని, మొత్తం ఆరు రౌండ్లలో 150 మార్కులకు ఉంటుందని వివరించారు. అదే విధంగా 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ఈనెల 23న జరగనున్న స్పెల్‌బీ పోటీల్లో భాగంగా రాత పరీక్ష నిర్వహించి, ఎంపికైన వారిని ఫైనల్స్‌కు పంపుతామని తెలిపారు. వివరాలకు 99482 27362, 70130 19166, 92471 93275 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



బ్రోచర్లు విడుదల చేస్తున్న కృష్ణప్రసాద్, రత్తయ్య

ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిశీలించి, శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్‌లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 22 ఫిర్యాదులు తీసుకొని, అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుంచి అందే అర్జీల్లో తక్షణం పరిష్కారం చేయగలిగినవి, కొంత సమయం తర్వాత చేయగలిగినవి వేర్వేరుగా లిస్టు తయారు చేయాలని కోరారు. డయల్ యువర్ కమిషనర్‌కి అందిన అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలన్నారు. అర్జీల పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్‌కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు తీసుకొని అధికారులతో మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలని, ఆయా అర్జీలను ర్యాండమ్‌గా క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తామని పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజల నుంచి 47 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 20, ఇంజినీరింగ్ విభాగానికి 15, రెవెన్యూ విభాగానికి 4, ప్రజారోగ్య విభాగానికి 5, అకౌంట్స్ విభాగానికి 3 ఫిర్యాదులు అందాయని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సిహెచ్.ఓబులేసు, డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, సీఎంఓహెచ్ డాక్టర్ శోభారాణి, ఎంహెచ్‌ఓ డాక్టర్ రవిబాబు, సిటి ప్లానర్ రాంబాబు, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.



నగర ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న కమిషనర్

ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత చెన్నుపాటి

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు స్థాపించుకునే హక్కును సాధించి పెట్టిన మహనీయుడు చెన్నుపాటి లక్ష్మయ్య అని యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణ కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు పేర్కొన్నారు. సోమవారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఉపాధ్యాయ ఉద్యమనేత చెన్నుపాటి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమం కోసం చెన్నుపాటి తన జీవితాన్ని త్యాగం చేశారని అన్నారు. సంఘాన్ని స్థాపించడమే కాకుండా రాష్ట్రం మొత్తం తిరిగి ఉపాధ్యాయులను ఏకం చేస్తూ సంఘాన్ని బలోపేతానికి అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖరరావు, ఎం.కళాధర్ మాట్లాడుతూ చెన్నుపాటి ఆశయాల సాధనకు కృషి చేస్తామని తెలిపారు. ఉపాధ్యాయుల హక్కుల సాధనలో చెన్నుపాటి స్ఫూర్తితో రాజీలేని పోరాటం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, వై.నాగమణి జిల్లా కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, ఎం.గోవిందు, కె.రంగారావు, బెల్లంకొండ ప్రసాద్, ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.కోటిరెడ్డి, సీనియర్ కార్యకర్తలు ఆదామ్ సాహెబ్, కొండపల్లి వెంకటేశ్వరరావు, భాస్కర్, పి.శ్రీనివాసరావు, కిషోర్ పాల్గొన్నారు.


బుధ, గురువారాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం

నెహ్రూనగర్: తాగునీటి పైప్‌లైన్ మరమ్మతుల దృష్ట్యా బుధ, గురువారాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. నగరపాలక సంస్థ హెడ్ వాటర్ వర్క్స్‌కు ఉండవల్లి నుంచి తాగునీటి సరఫరా జరిగే 1600 ఎంఎం డయా పైప్ లైన్‌పై తక్కెళ్లపాడులో ఏర్పడిన లీక్ వలన అధిక మొత్తంలో నీరు వృథా దృష్ట్యా బుధవారం ఉదయం సరఫరా అనంతరం మరమ్మతులు చేపట్టడానికి ఇంజినీరింగ్ అధికారులు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారని చెప్పారు. తక్కెళ్లపాడు గ్రామంలోని పైప్ లైన్ పై ఏర్పడిన లీకు మరమ్మతుల కోసం హెడ్ వాటర్ వర్క్స్‌లోని ఫిల్టరేషన్ ప్లాంట్‌ని పూర్తిగా నిలిపివేయాల్సి ఉంటుందని వివరించారు. నగరంలోని నెహ్రూ నగర్, శారదా కాలనీ, వసంతరాయపురం, హెచ్‌ఎల్‌ఆర్, ఐపీడీ కాలనీ, స్తంభాల గరువు, గుజ్జనగుండ్ల, విద్యానగర్, హనుమయ్య నగర్, నల్లచెరువు, శ్రీనివాసరావుతోట, తారకరామ నగర్, ఏటీ అగ్రహారం, బీఆర్ స్టేడియం, ఎల్బీ నగర్, గోరంట్ల, అడవి తక్కెళ్లపాడు, రాజీవ్ గాంధీ నగర్, కోర్ట్ కాంపౌండ్, మిర్చి యార్డ్, హౌసింగ్ బోర్డ్ కాలనీ, కేవీపీ కాలనీ, శ్యామలానగర్, రెడ్డి పాలెం రిజర్వాయర్ల పరిధిలో పూర్తిగా తాగునీటి సరఫరా నిలుపుదల జరుగుతుందని, శుక్రవారం ఉదయం నుంచి యథావిధిగా సరఫరా జరుగుతుందని వెల్లడించారు.

కారు ఢీకొని యువకుడికి గాయాలు

పట్నంబజారు: కారు ఢీకొని వాహనచోదకుడు గాయపడిన ఘటనపై కేసు నమోదు అయింది. వెస్ట్ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు.. ఈనెల 8న రాత్రి చంద్రయ్యనగర్‌కు చెందిన దారా సలీమ్‌రాజ్, స్నేహితుడు పి.కిరీటి అరండల్‌పేట 1వలైనులో రైల్వే క్యాంటిన్ వద్దకు ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. అదే సమయంలో గుర్తుతెలియని కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. సలీమ్‌రాజ్ కాలు విరిగింది. స్నేహితుడు కిరిటికి స్వల్ప గాయాలు అయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సదరు కారు యజమాని ఒక ప్రముఖ వైద్యుడు కావడంతో రాత్రి వదిలి వేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై పోలీసులను వివరణ కోరగా వాహనం వివరాలు తెలియలేదని తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ ఘటనా స్థలానికి వెళ్లి విచారించి వచ్చారు. వాహన వివరాలు తెలియదనడంలో పోలీసులు గోప్యంగా వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రతిభావంతమైనది శతక సాహిత్యం



నగరంపాలెం: తెలుగు సాహిత్యంలో శతక పద్యం ఎంతో ప్రాశస్త్యాన్ని పొందిందని హిందూ కళాశాల తెలుగు విభాగం అధ్యక్షుడు, ఆచార్యులు యల్లాప్రగడ మల్లికార్జునరావు అన్నారు. గుంటూరు పుస్తక మహోత్సవ వేదికపై అభ్యుదయ రచయిత సంఘం ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం విద్యార్థులకు శతక పద్య పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శతక సాహిత్య ప్రక్రియకు శతాబ్దాల తరబడి మన సాహిత్యంలో ప్రత్యేకతను కలిగి ఉందని అన్నారు. శతక పద్యం సందేశాత్మకంగా ఉంటూ, పాఠకులకు సులువుగా అర్థమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో తెలుగు పండితులు కొణతం నాగేశ్వరరావు, అరసం జిల్లా కార్యదర్శి బుల్లా రవి, ప్రముఖ కథా రచయిత కాట్రగడ్డ దయానంద్ పాల్గొన్నారు.